# వాళ్లాయన కామసూత్రాలు




బ్రా హుక్కు వీపు మీద సరిగ్గా పట్టక పరాయి ఆవిడ అవస్థ పడుతున్న వేళ, మధ్య నున్న సందులోంచి, సరిగ్గా వెయ్యనికిటికీ రెక్కల ఖాళీలోంచి, ఇవతలింటి మగ బుద్ధి గుడ్లప్పగించి గుటకలు మింగుతున్న వేళ.

"దొరికిందండోయ్, దొరికింది!" అని కనకరత్నం హఠాత్తుగా అరచింది!ఆవిడ తుళ్ళిపడి ఇటు తిరిగింది. తన్నెవరో గుర్తించడం గమనించింది. పైటనిండుగా కప్పుడుని పక్క గదిలోకి తప్పుకుంది.

సుబ్బరాజు, మనసు విలవిల లాడింది. ఇంతసేపై ఊపిరి బిగబట్టిన మధుర దశ్యం చేజారినట్టు చేసిందే, చాలక దొరకడం మేమిటి, నిన్ను దుర్గమ్మకొండ ఎక్కించి, దొర్లించ! అని పెళ్ళాన్ని కసిదీరా తిట్టుకున్నాడు. అయితే పైకి తేలకుండా పైపైకి చేరుకోవడం ఎలాగో ప్రాక్టీసు చేసి ఫలితాన్ని కొల్లగొట్టడం నేర్చుకున్న పండితుడు ఆయన. చాతకానిదంటూ ఉంటే మళ్ళుతున్న వయసుని వెనక్కి మళ్ళించ లేకపోడమే. జుట్టుకి రంగూ బుగ్గలకి క్రీమూ ఎంతగా పూసినా కళ్ళకింద మచ్చలు

దాగడం లేదు. మునపట్లా పై ఆటలకి లైన్ క్లియర్ అవడం కొంత కష్టంగానే ఉంది. వయసుమళ్ళిన ఆడాళ్ళయితే బాగా ముస్తాబయి అలా అద్దం వైపు చూస్తూ ఎంతసేపయినా ఉండి పోగలరు. తమ ప్రతిబింబం చూసుకొనే మనసు పడి మరులు కొనగలరు వాళ్ళు. మగాళ్ళకి అలా ఎలా కుదురుతుంది! మూడో పురుషార్థం లోనే కదా, చచ్చేదాకా మగాడు నాలుగోది అందుకోవాలని తహతహ లాడేది! పక్కింటి ఇవతలి గదిలోకి ఓ కొత్త నర్సమ్మ అద్దెకి దిగిందని, తెలిసిందగ్గిర్నుంచి సుబ్బరాజు మనసు మరీ మారాంచేస్తోంది. ఆవిడకి ఏ ముప్పై అయిదో ఉండవచ్చు. నలుపూ, తగు మాత్రం లావు కూడాను. ఏం చేస్తాం. ఎడ్జెస్ట్ మెంట్‌లోనే కదా ఎనిమిదో హెవెను ఉందంటారు! ఈ వయసులో తనకి మరీ "లావొక్కింతయులేదు" అనిపించే మైతీగెలు ఎక్కడ దొరుకుతారు!

కనకరత్నం మాత్రం కూచున్న చోటునుంచి కదల్లేదు. కదిలినా లేచినా ఆయాసం వస్తుందని ఆవిడ అనుమానం. అలాగని యాక్టివిటీ తక్కువనుకునేరు. సుబ్బరాజు రిటైరు అయ్యాక, ఒకేసారి చేతికందిన పెద్ద మొత్తం ఆ యింటికయిన అప్పుతీర్చడానికే సరిపోయింది. వాల్లాయనది పింఛను అందుకునే ఉద్యోగం కాదు. ఇల్లుకూడా కనకరత్నం పేరనే ఉంది. పై ఊళ్ళలో స్థిరపడిన ఇద్దరు మగపిల్లలూ డబ్బు నెలనెలా ఆవిడపేరనే పంపిస్తారు. ప్రస్తుతం దేనికయినా సుబ్బరాజు పెళ్ళాం ముందు చెయ్యిజాచవలసిందే.

మొదట్నుంచీ సుబ్బరాజుది ఒకరికి నొప్పి కలగకుండా తనకి కావలసినంది చేసుకుపోయేరకం. ఈప్రపంచం కొన్నినీతులకీ నియామాలకీ కట్టుబడి ఉందనే భ్రమకి అతనెప్పుడూ లోను కాలేదు. తనకి తోచింది పదిమందికి ప్రచారం చేసి టైము వేస్టుచేసుకోడం అతనికి నచ్చదు. తనకి దైహిక వాంఛలు ఎలావుంటాయో అలాగే ఎదుటివారికి ఇంకోరకం మానసికవసారాలు వుండొచ్చు. దేన్నైనా కేష్ చేసుకోగలగడంలోనే అతనికి కైవల్యం కనిపిస్తుంది.

కనకరత్నం కూచునే మనిషేగాని ఊరికే ఊరుకొనే మనిషికాదు. అక్కణ్ణుంచే ఎంతటి ఉద్రేకాన్నయినా ప్రవహింప చేయగలదు. ఇన్నాళ్ళూ చాకిరీ చేసి చేసి అలిసిపోయింది. కళ్ళ మీదకి కళ్ళజోడు దిగిం దగ్గర్నుంచీ ఆవిడకి చదవాలనే కోరిక తగ్గి, రాయాలనే తపన పెరిగిపోయింది. భర్త ఇచ్చే ప్రోత్సాహంతో మరింత విజృంభించింది. కథలు,కాగితాలు, ఆరోజు విడుదలయిన అన్ని తెలుగు పత్రికలూ ఆయన తెచ్చి ఎదురుగా బల్ల మీద పెడతారు. ఆ యుద్ధ సామగ్రితో అక్కణ్ణుంచే సమస్త పురుషాహం కారాన్నీ చావుదెబ్బ తియ్యగలవని ఆవిడ దృఢవిశ్వాసం. అంతటి ఉత్సాహంతో పోయిట్రీలాంటింది. తన్నుకురావడం ఆమెకీ మధ్య ఎంత తృప్తినయినా ఇస్తోంది.

కని పడేసిన కొడుకులు చచ్చినట్టు తల్లిరుణం తీర్చుకుంటున్నారు. వండి పడెయ్యడానికీ, బజారుపనులు చెయ్యడానికీ జీతగాళ్ళు వున్నారు. అవీ ఇవీ అందించడానికి కట్టుకున్న మొగడున్నాడు. కనకరత్నం మగాడిమీద అక్షరాలా దాడి ప్రారంభించదా మరి! ఆ పూట ఆ ఆడపులి త్రేనుపు ఇది

దొరికందండోయ్ దొరికింది
ఆనాదినుండీ మగాడు చేసే
కిరాతకాలను సవాలు చేసే
కొత్త విశేషం దొరికింది!

ప్రశంసా పూర్వకంగా చూస్తూ సుబ్బరాజు చప్పట్లు కొట్టేడు. శరీరావసరాలని ఆదుకునే ఎలాంటి పరిస్థితులకయినా అతను అలా సలాం చేస్తూనే ఉంటారు. ఎవరికి కావలసింది వారికలా

దొరికి అందరూ కూలాసాగా ఉండడంకంటే ఎవరైనా కోరేది ఏముంటుంది! "ఆడదానికి జరుగుతున్న అన్యాయమా, పదికాలాలపాటు వర్ధిల్లుమా!" అని పాడుకుంటుంది, అతని మనసెప్పుడూ. ఈ రిటైరు అవడంకాదుగాని ఆవిడతోపాటు పత్రికలు చదువుతూ తెలుగు సినిమాలు చూస్తున్న అతనికి స్పష్టంగా బోధపడింది ఇదే అదేమిటో తెలిసినా మానినా, దానివల్ల ఏ ఒక్కరూ ఎన్నాళ్ళయినా మారకపోయినా, తెలుగు రైటర్స్‌కి ఇంత తిండి పెడుతున్న ముడిసరుకు మాత్రం "ఆడదానికి జరుగుతున్న అన్యాయమే."

'డేంజరులో దేవగాంధారి' అనే సీరియల్ పడుతున్న పత్రికని కనకరత్నం మొగుణ్ణి స్టేషనుకి పరిగెత్తించి తెప్పించుకున్నది. మృత్యువుతో హోరాహోరీ పోరాడుతున్న ఇప్పటి వారలవారం వారం సీరియల్స్ ధీర వనితా పాఠకుల బ్లడ్ సర్క్యులేషన్‌తో పాటు ప్రతికల నెట్ సర్క్యులేషన్ పెంచుతోంది! ఇది వరకు బాత్‌రూమ్ కయినా ఒక్కర్తీ వెళ్లగల కనకరత్నం ఆ స్త్రీ సాహసం నెత్తుర్లోకి ఇంకి, ఇప్పుడు లేచి నిలబడ్డాకయినా భర్త సాయం కోరుతోందనేది వేరే విషయం.

అంతేకాదు 'నవనారీ, నీకుజోహారు!' అనే పేరున ఈ మధ్య ఓ తెలుగు సినిమా విడదలయింది. మాంగల్యాన్నీ మాతృత్వాన్నీ కాదని మానవతని రక్షించే మహోన్నత స్థాయికి ఎదిగింది అందులో నాయిక. నిజాన్ని నెత్తుర్లా పీల్చి నిలువెత్తుగా నిలిచిన ఓ కసాయి రాజకీయవాదిని పదిమందిలో పేల్చేస్తుంది ఆ సాహసి. మీసాలతో పాటు గెడ్డాలు పెంచడంలో కూడా పోటీ పడుతున్న ఎంతటి మగధీరులూ ఆ వీరనారికి నీరాజనాలు అర్పిస్తున్నారు. ఓసారి అదే సినిమాకి ఓ ఫ్రెండుతో వెళ్లాడు సుబ్బరాజు. ఆ ఫ్రెండు జీవితంలో ఓ నిమిషమైనా తను మగాడినని మరచిపోని రకం. అంతటి అహంకారీ ఆ హీరోయిన్‌కి జేజేలు పలికాడు. వాళ్లావిడ సినిమా నుంచి యింటికి స్వతంత్రించి రిక్షా బేరమాడబోతే 'వెనక చెట్టంత మొగుడు ఉన్నాడనుకున్నావా, చచ్చాడనుకున్నావా!' అని అంత మందిలోనూ ఫాట్‌మని ఓ లెంపకాయ ఇచ్చుకున్నా డనేది అ ప్రస్తుతం.

'నా కెందుకీ సాయుధ పోరాటాలు? నా లాంటి వాడి 'రసాయుధ పోరాటాలు చాలు' అనుకుంటాడు సుబ్బరాజు. ' ఆ కొత్త విశేషం ఏమిటో అడక్కుండా అలా కూచుంటారేం!' అంది కనకరత్నం అతని ఆలోచనలు చెదరగొడుతూ. 'అదే అదే. కొత్త 'సంగతి' కోసం ఉవ్విళూరుతోంది నా మనసు' అన్నాడు సుబ్బరాజు పక్కింటి వైపు దొంగచూపులు చూస్తూ. 'ఇలా రండి నేను చెబుతా.' 'నాకు నమ్మకమే నువ్వు దారి చూపిస్తావని. ఇల్లాలే దేవత అని ఊరికే అన్నారా అనుభవజ్ఞులు!' అని దగ్గిరగా వెళ్ళాడు. అతని చేతిని ఆప్యాయంగా తన చేతిలోకి తీసుకుంటూ అంది.

'మీలాంటి ఉత్తములూ, సహృదయులూ, ఆడదాని మనసు కనిపెట్టిన వారూ నూటికి ఒక్కరో అరో ఉంటారు. అందరూ మీలాగే ఉంటే ఇలా ఎందుకు నాశనం అవును! అనాదినుండి ఆడదాన్ని అతి నీచంగానే చిత్రిస్తున్నారు! ఎంతో ఆలోచించిన మీదట ఓ పాతశ్లోకంలోని పక్షపాత వైఖరి బయటపడింది. చూడండి 'మాతృదేవోభవ. పితృదేవోభవ' అన్నారు. తల్లినీ తండ్రినీ గురువునీ గెస్టునీ ఆకాశానికెత్తేరు. మొట్టమొదట ఆడదాని పేరెత్తితే అదే గొప్పని పొంగిపోయాం యిన్నాళ్లూ.

ఈ నలుగుర్లోనూ ఒక్కర్తే ఆడది. అంత అన్యాయమా! అంతేకాదు తల్లిదండ్రులకే తప్ప కట్టుకొన్న పెళ్ళానికేదీ ప్లేసు? గెస్టుగాడికంటె కనికష్టమై పోయిందా! దీని మీద నేనో పెద్ద పరిశోధనా వ్యాసం లాంటిది సమర్పించ దల్చుకున్నాను. ఏమంటారు?'

'వేరే అనడానికి ఏముంది! అందర్నీ ఇన్నాళ్లపాటు పెడత్రోవ పట్టించిన పక్షపాత సూక్తుల్ని

జుత్తు పట్టుకు చిత్తు చేస్తున్నావు. హిస్టరీ అనే పదం 'హి' తో ప్రారంభమైందనీ అది మార్చాలనీ, 'హి'ప్నటిజమ్ కూడా పురుషులు స్త్రీల పై పన్నిన మాయాజాల పదమనీ వరల్డ్ విమెన్ లిబ్ వారు ఆందోళన చేస్తున్నట్లు వినికిడి అవన్నీ ఎందుకు గాని ప్రస్తుతం నీకు కలిగిన సందేహం, ఇంత గొప్పదీ కొత్తదీ ఇదివరకు ఇంకొకరి కొచ్చినట్టు వినలేదు. కాలు కదపకుండా ముల్లోకాలూ గజగజ లాడిస్తుంది. నీ అవలోకనం హేట్సాఫ్. అయాం ప్రౌడ్ ఆఫ్ యు'

మొగుడు పెదిమెల మీద బూరెలు వండేస్తూంటే పరవశిస్తూవింటూ అది పైకి తేలకుండా చిరుకోపం ప్రకటిస్తూ కనకరత్నం ఇలా అంది. "కబుర్లతో తృప్తి పడే మనిషిని కానండీ, నాకు కార్యాచరణ ముఖ్యం. పట్టడమైతే ఆయువు పట్టు పట్టాను గాని ఆ శ్లోకం ఎందులోదో ఏ సందర్భంలో ఉపయోగించ బడిందో ఆ వివరాలు నాకు తెలీవు'

'నీ వినయం చూస్తే ముచ్చట వేస్తోందే కనకం'

'అదిగో, అలాంటి పొగడ్తలే వద్దన్నాను. మళ్లీ కట్టేస్తాడేమో మీరు వెంటనే సెంట్రల్ లైబ్రరీకి వెళ్లండి. శాన్ స్క్రీట్ సెక్షన్ గాలించండి. వీలయితే రిఫరెన్సు బుక్సు తీసుకురండి. అన్నట్టు అలాంటివి బయటకి ఇస్తారా?'

"రూల్సు ప్రకారం ఇవ్వకూడదుగాని పదో పాతికో మనది కాదనకుంటే అక్కడి అసిస్టెంటు కాదంటాడంటావా?'

"అయితే ఇంకా చూస్తారేం, స్పీడప్ ఇవిగో తాళాలు. ఎందుకేనా మంచిది రెండు ఏభై రూపాయిల నోట్లూ, వేరే ఓ ఏభై చిల్లరా పట్టి కెళ్లండి. ఆటోలోనే వెళ్లండి. కక్కూర్తి పడకండి. మీ ఆరోగ్యం మాత్రం ఏం బాగుంది. గనక!"

సుబ్బరాజు ఆటో హాస్పటల్ వైపు పూర్తిగా డైరెక్ట్ చెయ్యకుండానే దార్లో నర్సమ్మ ఎదురైంది నడిచి వస్తూ ఆటో ఆపించి

"మీ పక్కింటి వాణ్ణి, గమనించే ఉంటారు" అని పరిచయం చేసుకుని అటూ ఇటూ చూసి స్వరం తగ్గించి "మీ లాంటి అందగత్తెలు ఇంతగా రోజంతా పనిచేసి అలసిపోయి నడిచి రావడం ఏంబాగులేదు ...." అని ఏదో అనబోతే ఆవిడ అందుకుని" ... ఏం చేస్తాం అన్నీ తెలిసినా ఇరుగూ పొరుగూ పెద్ద మనుషులు తమకేం పట్టనట్టు ఊరుకుంటే" అంది. చాలు. సస్పెన్సు తెగిపోవడానికీ టెన్షన్ పెరిగిపోవడానికీ ఆ మాత్రం హింట్ చాలు. చెయ్యి అందించి ఆటోలోకి దారి చూపాడు. ఇంకో పావుగంటకి హోటల్ "సుఖసీమ" ఎయిర్ కండిషన్ గదిలో అదే చెయ్యి అందించి గుండెల మీదకి లాక్కున్నాడు.

ఆ వేళకి అదే కుర్చీలో కనకరత్నం కునికిపాట్లు పడుతూవుంది. ఉపనిషత్తులు వెలసిన కాలంలో, శిష్యుల్ని కన్నబిడ్డల్లా టీచర్లు చూసుకునే గురుకులాలలో, ఆడా మొగా తేడాలేకుండా చేర్చుకున్న స్టూడెంట్స్‌కి పెద్దలు చెప్పే ప్రథమ ప్రవచనం "మాతృదేవోభవ" అనీ చిన్నపిల్లలే కాబట్టి అందులో భార్య ప్రసక్తి ఉండనే ఉండదనీ, ఇదంతా ఏ లైబ్రరీకి వెళ్లకుండానే సుబ్బరాజుకి ముందే తెలుసు. కాని భార్యల అజ్ఞానాన్ని పోషించడమే భర్తల సౌఖ్యానికి పెట్టుబడి అని ఆ గడుసరి ఎప్పుడో గ్రహించాడు!.

(జ్యోతి మాసపత్రిక, మార్చి, '86)